www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 17 | మే | 2026
పేజీలు : 8

## ధరల నియంత్రణలో కేంద్రం విఫలం




సెంటర్ స్ప్రెడ్

సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా
- పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి
- సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా, నిరసన

# విజయ డెయిరీకి పూర్వ వైభవం తీసుకురావాలి



-రాష్ట్రంలోనే ఆదర్శ డెయిరీగా నిలపాలి
-అన్ని హంగులతో ఆధునీకరణ
-ఖమ్మం జిల్లా పాడి పరిశ్రమ అభివృద్ధి సమీక్షలో మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం విజయ డెయిరీకి పూర్వ వైభవం తీసుకువచ్చి రాష్ట్రంలోనే ఆదర్శ డెయిరీగా నిలిపేలా సమగ్రాభివృద్ధి చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రోటరీనగర్‌లో ఉన్న విజయ డెయిరీ భవనానికి తక్షణ మరమ్మతులు చేపట్టి ఆధునీక సదుపాయాలతో అభివృద్ధి చేయాలన్నారు. శనివారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో విజయ డెయిరీ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కె. చంద్రశేఖర్ రెడ్డిలతో కలిసి మంత్రి

మిగతా 2లో..

# గిడ్డంగికి.. పోటెత్తిన మక్కలు..!

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలోని కల్లూరు గూడెం గోదాం వద్ద అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. గత పది రోజులుగా ఖమ్మం జిల్లా నలుమూలల నుంచి వందలాది ట్రాక్టర్లు, పదుల సంఖ్యలో లారీలతో

మిగతా 2లో..



-అధికారుల అలసత్వం, నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం
-రోజుల తరబడి నిరీక్షణ, నీడానీరు లేక డ్రైవర్ల అవస్థలు
-వే బిల్లులు లేకున్నా దిగుమతులు



# పోరాటాలతోనే హక్కుల సాధన






-బిజెపివి అవకాశవాద రాజకీయాలు
-ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
-మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెదునూరి జ్యోతి
-ఉత్సాహపూరిత వాతావరణంలో మహిళా సమాఖ్య జిల్లా మహాసభలు



**ప్రజాపక్షం/ వైరా :** మహిళా పోరాటాలతోనే హక్కులు సాధించబడ్డాయని ప్రస్తుత పాలకులు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా బహుముఖ పోరాటాలకు మహిళలు సిద్ధం కావాలని తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెదునూరి జ్యోతి పిలుపునిచ్చారు. ఎందరో సంఘ సంస్కర్తలు, అమరుల పోరాటాల ఫలితంగా ఆస్తి, విద్య, సమానత్వపు హక్కు సహా పలు హక్కులను సాధించామని ప్రస్తుత పాలకులు ఆ హక్కులను నీరు గారుస్తూ మహిళా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా 22వ మహాసభలు శనివారం వైరాలోని తుల్లూరు తులశమ్మ నగర్

మిగతా 2లో..

# గిడ్డంగికి పోటెత్తిన మక్కలు..!





(మొదటిపేజీ తరువాయి)

మొక్కజొన్నలు గోదాంకు పోటెత్తుతున్నా, సరైన పర్యవేక్షణ లేక రైతాంగం తీవ్ర గందరగోళానికి గురవుతోంది.

**రోజుల తరబడి నిరీక్షణ....**

దూర ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలు రోజుల తరబడి దిగుమతి కాక వెయిటింగ్ చార్జీల భారంతో రైతులు విలవిలలాడుతున్నారు. గత వారం రోజులుగా గోదాం వద్ద కాపుకాస్తున్న డ్రైవర్లకు కనీసం నీడ, మంచినీరు, ఆహారం కూడా ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**'దొడ్డిదారి' దిగుమతులు...**

అన్ని పత్రాలు ఉన్న వాహనాలను పక్కనపెట్టి, వే బిల్లులు లేని వాహనాలను సైతం గోదాం సిబ్బంది అధికారులతో కుమ్మక్కై త్వరితగతిన దిగుమతి చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు పాటించే వారికి నిరీక్షణ, అక్రమార్కులకు ప్రాధాన్యమా అని ప్రశ్నిస్తున్నారు.

**హమాలీల కొరత...**

హమాలీలు లేకపోవడంతో రైతులే స్వయంగా ట్రాక్టర్ల నుంచి మొక్కజొన్న బస్తాలు దింపుకోవాల్సిన దుస్థితి నెలకొంది. శనివారం రైతులు, సిబ్బంది మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోగా, తహశీల్దార్ జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఏఎస్ఐ నాగేశ్వరరావు, జయబాబుల పర్యవేక్షణలో దిగుమతులు కొనసాగుతున్నాయి. గోదాం వద్ద మౌలిక సౌకర్యాల కల్పనలో, హమాలీల నియామకంలో అధికారుల అలసత్వం స్పష్టంగా కనిపిస్తోంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతు పడుతున్న కష్టాలు అధికారులకు కనిపించడం లేదా అని రైతు సంఘాలు మండిపడుతున్నాయి. తక్షణమే సౌకర్యాలు కల్పించి, పారదర్శకంగా దిగుమతులు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ వెల్లువెత్తుతోంది.

# విజయ డెయిరీకి పూర్వ వైభవం తీసుకురావాలి

(మొదటిపేజీ తరువాయి)

తుమ్మల నాగేశ్వరరావు పాడి పరిశ్రమ అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. ఖమ్మం జిల్లాలో పాల ఉత్పత్తి, సేకరణ, రైతులకు లభించే మద్ధతు, మహిళా భాగస్వామ్యం వంటి అంశాలపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఖమ్మం విజయ డెయిరీ రోజుకు 10వేల లీటర్ల పాల సేకరణతో కళకళలాడేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేశారు.రైతులకు నమ్మకమైన సంస్థగా నిలిచిన విజయ డెయిరీ మళ్లీ అదే స్థాయిలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఖమ్మం జిల్లాలో పాడిపరిశ్రమకు అపార అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతుల్లో విశ్వాసం పెంపొందించేలా పారదర్శక విధానాలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సమర్థులైన అధికారులు రైతుల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకుని వేగంగా పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పాల సేకరణ వ్యవస్థను బలోపేతం చేయడం, రవాణా మార్గాలను శాస్త్రీయంగా పునర్వ్యవస్థీకరించడం, మహిళా భాగస్వామ్యాన్ని పెంచాలన్నారు. ఖమ్మం డెయిరీని అన్ని వసతులతో ఆధునీకరించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా పాల సేకరణను పకడ్బందీగా చేపట్టాలన్నారు. పాడి రైతులకు అవసరమైన బ్యాంకు రుణాలు అందేలా అధికారులు సమన్వయం చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ముల్కనూరు డెయిరీ అభివృద్ధి నమూనాను వివరించగా మంత్రి హర్షం వ్యక్తం చేశారు.జిల్లాలో పశువుల సంఖ్య పెంచడం ద్వారా పాల ఉత్పత్తిని గణనీయంగా పెంచే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పాల ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేసి రైతులకు మెరుగైన ధరలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి ఆలోచనకు అనుగుణంగా విజయ డెయిరీ ఇప్పటికే అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేసిందని ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి తెలిపారు. ఖమ్మంజిల్లాలో నాణ్యమైన పాల సేకరణకు విస్తృత అవకాశాలు ఉన్నాయని అత్యంత పారదర్శకంగా పాడి పరిశ్రమ అభివృద్ధి చెందేలా పూర్తి సహకారం అందిస్తామన్నారు.ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, సహకార శాఖ రిజిస్ట్రార్ రాహుల్ రాజ్, విజయ డెయిరీ జనరల్ మేనేజర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాలతోనే హక్కుల సాధన




(మొదటిపేజీ తరువాయి)

(కమ్మ వారి కళ్యాణ మండపం)లో జరిగాయి. పోటు కళావతి, దండి శ్రీజ, సిహెచ్ సీతామహాలక్ష్మి, బేబీ రాణి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన నెదునూరి జ్యోతి మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా మహిళల జీవితాల్లో మార్పులు వస్తున్నాయని ప్రగతిశీల మార్పుల దిశగా మహిళా సమాఖ్య పని చేస్తుందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ చట్ట సభల్లో కల్పించేందుకు బిల్లు ప్రవేశ పెట్టడం వెనక బిజెపి అవకాశవాద రాజకీయం దాగి ఉందన్నారు. ప్రస్తుత పార్లమెంటు సభ్యులకు అనుగుణంగానే బిల్లును ప్రవేశపెట్టవచ్చు కానీ బిజెపి ఆ దిశగా ఆలోచించకుండా డిలిమిటేషన్‌తో ముడిపెట్టిందని ఆమె తెలిపారు. కేవలం విపక్షాలను విమర్శించడం కోసం మాత్రమే బిల్లును ప్రవేశ పెట్టారు తప్ప బిల్లుపై బిజెపికి చిత్తశుద్ధి లేదన్నారు. దేశంలో మహిళలపై బిజెపి పాలనలో దాడులు పెరుగుతున్నాయని బిజెపి పాలిత రాష్ట్రాల్లో కనీస న్యాయం గురించి ప్రశ్నించడం నేరంగా పరిగణిస్తున్నారని ఆమె తెలిపారు. మనుధర్మ శాస్త్రాన్ని ప్రబోధించడం ద్వారా బిజెపి ప్రజలను తప్పుదారి పట్టిస్తుందని ఆమె తెలిపారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాలు శ్రామిక మహిళలకు శాపంగా మారాయని పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు బతకలేని స్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుని పట్ల పోలీసులు, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయమని సత్వరం బండి భగీరథను అరెస్టు చేసి తగు రీతిలో శిక్షించాలని జ్యోతి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. తులం బంగారం, నెలకు రూ. 2,500 ఖాతాల్లో జమ, విద్యార్థులకు స్కూటీలు సహా అన్ని హామీలను నెరవేర్చాలన్నారు. సమాన పనికి సమాన వేతనం లభించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు.



**మహిళా చైతన్యంతోనే సమాజ మార్పు : చంద్రకళ**

మహిళా చైతన్యంతోనే సమాజంలో మార్పు వస్తుందని మహిళల స్థితిగతులను బట్టి సమాజాభివృద్ధిపై అంచనా వేయవచ్చునని వైరా మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాపా చంద్రకళ తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు పూర్తి స్థాయిలో అట్టడుగు వర్గాలకు చేరడం లేదని అవి పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు మహిళా సమాఖ్య పోరాటాలు దోహదపడాలని ఆమె కోరారు. నాయకత్వ లేమి కూడా మహిళలకు శాపంగా మారుతుందని అత్యుత్తమ నాయకత్వం తయారు కావాలని ఆమె ఆకాంక్షించారు. మహిళల్లో ఆరోగ్యం పట్ల కూడా చైతన్యం అవసరమని జబ్బులకు భయపడితే ప్రాణాలకే ప్రమాదమని మారిన ఆధునీక యుగంలో ప్రతి వ్యాధికి చికిత్స ఉందని దానిని త్వరితగతిన పొందడం ద్వారా ఆరోగ్యవంతులుగా జీవించవచ్చునని డాక్టర్ కాపా చంద్రకళ సూచించారు.

### పలువురి సౌహార్ధ సందేశాలు...

మహిళా సమాఖ్య జిల్లా మహాసభలను పురస్కరించుకుని ఐద్వా నాయకురాలు బుగ్గవీటి సరళ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి సందేశాలు ఇచ్చారు. బలమైన మహిళా ఉద్యమాలే ప్రజా చైతన్యానికి మార్గదర్శకంగా నిలుస్తాయని వారు తెలిపారు. గ్రామ స్థాయి నుండి మహిళా ఉద్యమాన్ని నిర్మించడమే మహిళల పట్ల జరుగుతున్న వివక్ష, దాడులకు పరిష్కారమని వారు సూచించారు. ప్రతి ఘటనపైన మహిళలు స్పందించే తత్వాన్ని అలవర్చుకోవాలని వారు సూచించారు. ఈ మహాసభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మహిళా సమాఖ్య నిర్మాణ బాధ్యులు దొండపాటి రమేష్, మహిళా సమాఖ్య నాయకురాలు ఏపూరి లతాదేవి, తాటి నిర్మల, బత్తినేని నీరజ, నల్లమోతు శైలజ, మందడపు రాణి, కర్నాటి నళిని, ఏపూరి పద్మ, కారం కోటమ్మ, మేళ్లచెరువు లలిత, జమ్ముల లక్ష్మి, రంజాన్‌బీ తదితరులు పాల్గొన్నారు. మహాసభ ప్రారంభ సూచికంగా మహిళా సమాఖ్య పతాకాన్ని బత్తినేని నీరజ ఆవిష్కరించారు. మహిళా సమాఖ్య నాయకురాలు తాటి నిర్మల సంతాప సందేశాన్ని ప్రవేశపెట్టగా కార్యదర్శి నివేదికను ఏపూరి లతాదేవి ప్రవేశపెట్టారు. ఆహ్వాన సంఘ అధ్యక్షురాలు నల్లమోతు శైలజ అధ్యక్ష ఉపన్యాసం చేశారు.

# ఘనంగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష జన్మదిన వేడుకలు

-సత్తుపల్లిలో పేదలకు అన్నదానం

-చీపు నరసింహ గౌడ్ పర్యవేక్షణలో నిరుపేదలకు అన్నదానం





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పలాస నియోజకవర్గ శాసనసభ్యురాలు గౌతు శిరీష జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలో సత్తుపల్లిలో యువ భారత్ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. శిరీష జన్మదినం సందర్భంగా పట్టణంలోని నిరుపేదలు, యాచకులు, అనాథలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ ప్రతినిధి చీపు నరసింహ గౌడ్ స్వయంగా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి వందలాది మందికి అన్న వితరణ చేశారు. భోజనంతో పాటు మంచినీరు అందించి పేదల ఆకలి తీర్చారు. ఈ సందర్భంగా యువ భారత్ శక్తి ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమై, నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఆమెకు ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే పుట్టినరోజును పురస్కరించుకుని సేవా దృక్పథంతో అన్నదాన కార్యక్రమం చేపట్టి ఉదారత చాటుకున్న చీపు నరసింహ గౌడ్‌కు ఫౌండేషన్ సభ్యులకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. పుట్టినరోజు వేడుకలను ఆడంబరాలకు పోకుండా సేవా కార్యక్రమాల రూపంలో నిర్వహించడం అభినందనీయమని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈడ వేణు, పామర్తి అశ్రీత్, పరసా గోపి, పరసా చందు, అర్చన సురేష్, ఏకుల నాగార్జున ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కరాటే శిక్షణ



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి గ్రామ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఉచిత కరాటే శిక్షణ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మేదరి వీర ప్రతాప్(టోనీ)పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. గ్రామీణ ప్రాంత పిల్లలు చదువుతో పాటు క్రీడలు, ఆత్మరక్షణ కళల్లోనూ రాణించాలని లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మొదటి రోజు నుంచే పిల్లలు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కరాటే ద్వారా పిల్లల్లో క్రమ శిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక ధృఢత్వం, మానసిక ధైర్యం పెరుగుతాయని, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచే విధంగా యువతను తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా శిక్షకులు విద్యార్థులకు ప్రాథమిక కరాటే విన్యాసాలు, శారీరక వ్యాయామాలు నేర్పించారు. గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ తమ పిల్లలను శిక్షణకు పంపిస్తున్నారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి, వార్డు మెంబర్లు అంకోజు సరోజ, రావుల రాజశేఖర్, మేకల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్స్డ్ సర్వేయర్లకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

**-రీ సర్వేలో అవసరాన్ని బట్టి లైసెన్స్డ్ సర్వేయర్లను వినియోగిస్తాం**
**-లైసెన్స్డ్ సర్వేయర్లతో సమీక్షించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లైసెన్స్డ్ సర్వేయర్లకు భవిష్యత్తులో విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి లైసెన్స్డ్ సర్వేయర్లతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా లైసెన్స్డ్ సర్వేయర్లు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. తమకు శిక్షణ, అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసిన తర్వాతే లైసెన్సులు జారీ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం భూ భారతి పోర్టల్ మ్యాపింగ్ ప్రక్రియ అమల్లోకి వచ్చిందని తిరుమలాయపాలెం మండలంలో రీ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆ ప్రక్రియలో కొంత మంది లైసెన్స్డ్ సర్వేయర్లను వినియోగిస్తున్నామని భవిష్యత్తులో భూములు కొనుగోలు, రిజిస్ట్రేషన్ల సమయంలో మ్యాపింగ్ విధానం అమల్లోకి వస్తుందని, కూసుమంచి గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో అన్ని గ్రామాల్లో అమలు చేస్తామని దీనితో లైసెన్స్డ్ సర్వేయర్లకు పని, ఆదాయం లభిస్తాయన్నారు. ప్రభుత్వం ఉపాధి అవకాశాల కల్పనపై సానుకూలంగా ఉందని దీనికి కొంత సమయం అవసరమని తెలిపారు. రీ సర్వే సమయంలో అవసరాన్ని బట్టి లైసెన్స్ సర్వేయర్లను వినియోగిస్తామని రిజిస్ట్రేషన్ సమయంలో కూడా ఆదాయం వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. సర్వే ఫీజుల పెంపు అనేది జిల్లా స్థాయిలో తీసుకునే నిర్ణయం కాదని ప్రభుత్వం నిర్ణయించాల్సిన అంశమని కలెక్టర్ తెలిపారు. లైసెన్స్డ్ సర్వేయర్లు ఇచ్చిన వినతులను ప్రభుత్వానికి పంపిస్తామని కొన్ని విధాన పరమైన నిర్ణయాలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఫీల్డ్‌లో ఎవరైనా తప్పులు చేస్తే వారి లైసెన్స్‌లు రద్దు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో లైసెన్స్డ్ సర్వేయర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తపోటు పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు**



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** రక్తపోటు పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు తెలిపారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు ప్రజలకు ముఖ్య సూచనలు తెలుపుతూ, ప్రతి సంవత్సరం మే 17న ప్రపంచ రక్తపోటు దినోత్సవంను నిర్వహించడం ద్వారా ప్రజల్లో 'రక్తపోటు' పై అవగాహన పెంపొందిచడం ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, అధిక ఉప్పు వినియోగం, శారీరక శ్రమ లేకపోవడం, మానసిక ఒత్తిడి, ధూమపానం, మద్యపానం వంటి అలవాట్ల వలన రక్తపోటు సమస్య వేగంగా పెరుగుతోంది అని పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న అంసక్రమిత వ్యాధులైన బిపి, షుగర్, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు 30 సంవత్సరాల పైబడిన వారందరికీ పరీక్ష చేయగా, సుమారు 8,00,835 మంది ప్రజలకు పరీక్షలు నిర్వహించగా, వారిలో 79,588 మంది రక్తపోటు, బాధితులను గుర్తించారు. వీరిలో 52,681 మంది ప్రభుత్వ వైద్య సంస్థల్లో చికిత్స నియంత్రణలో ఉన్నారు. అదేవిధంగా మధుమేహం కేసులు కూడా గణనీయంగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు నిరంతరం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని కోరడం జరిగిందని తెలిపారు. అలాగే జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలలో ఉచితంగా బిపి, డయాబెటిస్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రైతులను వేధిస్తున్న లారీల కొరత..!

**-లారీల కొరతను ఆసరా చేసుకుంటున్న దళారులు**
**-రూ.40ల నుంచి రూ.50లు వసూలు**
**-కుప్పలు కుప్పలుగా ధాన్యం, మొక్కజొన్న**







**ప్రజాపక్షం/వైరా:** ఆరుగాలం రాత్రి పగలు అనే తేడా లేక కష్టపడి పండించిన ధాన్యం, మొక్కజొన్న పంట చేతికొచ్చిన సమయంలో రైతులను లారీల కొరత వేధిస్తూ ఉంది. వేలాది ఎకరాల్లో వరి మొక్కజొన్న సాగు చేసిన రైతులు పటను రోడ్లపై వ్యవసాయమ ఆర్కెట్‌లో పంట పొలాల్లో బస్తాలు రాసులు నిల్వ చేసి ఉంచి ఎదురుచూస్తున్నారు. సుమారు నెల రోజుల నుండి రైతులు పండిన పంటను రోడ్లపైనే, ఖాళీ స్థలాల్లో ఉంచి పడికాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. లారీల కొరత తీవ్రంగా వేధిస్తూ ఉంది. లారీలు దొరకక ప్రతి గ్రామంలో పంటలు నిల్వ ఉన్నాయి. వాతావరణంలో వస్తున్న మార్పులను చూసి ప్రతిరోజు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. లారీల కోసం వైరాలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్ద రెవెన్యూ, రవాణాశాఖ, పోలీస్‌శాఖ, సివిల్‌సప్లై అధికారులు చేస్తున్న ప్రయత్నాల వద్ద పెద్ద ఎత్తున రైతులు చేరుకొని వారి పంటను బయటికి పంపించుకునేందుకు పడరాని ఇబ్బందులు పడుతున్నారు.

### లారీల కొరతను నగదుగా చేసుకుంటున్న దళారులు...

రైతుల పండించిన ధాన్యం పంపించడానికి లారీల కొరత ఏర్పడడంతో కొంతమంది దళారులు ఈ అవకాశాన్ని వారికి అనుకూలంగా మార్చుకొని ఏదో ఒక రూపంలో లారీలను ఏర్పాటు చేసుకొని ఒక్కొక్క బస్తా నుంచి రూ.40ల నుంచి రూ.50ల వరకు వసూలు చేస్తున్నారని వాదనను జోరుగా వినిపిస్తున్నాయి. జిల్లాలో ధాన్యం తోలేందుకు లారీల కాంట్రాక్టర్లను దక్కించుకున్న వారు దళారులతో కుమ్మక్కై రైతు నుంచి బస్తాలు తీసుకెళ్లేందుకు డబ్బులు వసూలు చేస్తున్నారని వాదన జోరుగా వినిపిస్తుంది. వైరా, బోనకల్, కొణిజర్ల మండలాలతో పాటు పలు మండలాల్లో రైతు అవసరాన్ని దళారులు వారికి అనుకూలంగా మలుచుకొని నగదుగా మార్చుకుంటున్నారని వినిపిస్తుంది.

### మిల్లుల వద్ద దిగుమతి కాని ధాన్యం...

లారీలతో ధాన్యం బస్తాలను మిల్లులు వద్దకు తీసుకెళ్లిన కూడా మిల్లుల వద్ద పడికాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజులు తరబడి ధాన్యం దింపుకోకుండా కొంతమంది మిల్లర్లు ఉండడంతో అక్కడికి వెళ్లిన లారీలు డ్రైవర్లు, రైతులు ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### మా సమస్యకు పరిష్కారం ఎప్పుడు దొరుకుతుంది...

రైతుల ధాన్యం మొక్కజొన్న సమస్యకు పరిష్కారం ఎప్పుడు దొరుకుతుంది. పండిన పంట ఎప్పుడు బయటికి పంపించుకోవాలని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రోజురోజుకు లారీల కొరత వేధిస్తుంది తప్ప సమస్యకు పరిష్కారం దొరకడం లేరు. అధికారులు సమస్యను త్వరగా పరిష్కరించాలని అన్నదాతలు కోరుతున్నాను.

# గృహ వినియోగ ఎల్‌పిజి సిలిండర్లు ఇంటి అవసరాలకు ఉపయోగించాలి : ఏసిపి



**ప్రజాపక్షం/వైరా:** ఇటీవల అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో గ్యాస్ సరఫరాలో అంతరాయం కలగవచ్చని ప్రభుత భావించి రాష్ట్ర వ్యాప్తంగా గృహ వినియోగ ఎల్‌పిజి సిలిండర్ల సరఫరాను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందని వైరా ఏసిపి సారంగపాణి అన్నారు. శనివారం వైరాలో ఏసిపి సారంగపాణి మాట్లాడుతూ గృహ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరఫరా వ్యవస్థను కట్టుదిట్టంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే కొన్నిచోట్ల గృహ వినియోగడానికి మాత్రమే కేటాయించిన ఎల్‌పిజి సిలిండర్లను, వాణిజ్య అవసరాలకు(హోటళ్లు, టిఫిన్ ఎంటర్లు, క్యాటరింగ్ యూనిట్లు , ఇతర వ్యాపార సంస్థలు) ఉపయోగిస్తున్నట్లు సమాచారం అందుతుంది. ఈ విధమైన చర్యలు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉండటమే కాకుండా, సాధారణ గృహ వినియోగదారులకు గ్యాస్ కొరత ఏర్పడే పరిస్థితులను సృష్టిస్తారన్నారు. గృహ వినియోగ ఎల్‌పిజి సిలిండర్లు కేవలం ఇంటి అవసరాలకు గృహ సిలిండర్లను ఉపయోగించడం చట్ట విరుద్ధం. గృహ సిలిండర్లను వాణిజ్య వినియోగడానికి మళ్లించడం అత్యావశ్యక వస్తువుల చట్టం, సంబంధిత నియంత్రణ ఆదేశాల ప్రకారం అని ఏసిపి సారంగపాణి తెలిపారు.

# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం సత్తుపల్లి పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. శనివారం అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపిన పార్టీ నాయకులు, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ సామాన్యులపై భారాలు మోపుతోందని విమర్శించారు. సీపీఎం నాయకుడు మోరంపూడి పాండు రంగారావు మాట్లాడుతూ ఇంధన ధరల పెంపుతో నిత్యావసరాల ధరలు పెరిగి రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధిక పన్నులు తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలు కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి ప్రజా వ్యతిరేక విధానాలు విరమించుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, రావుల రాజబాబు, చప్పిడి భాస్కర్, రఫీ, రాధాకృష్ణ, అజీజ్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్థల విషయంలో కాంగ్రెస్ నాయకులు ఘర్షణ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ స్థలానికి సంబంధించిన విషయంలో కాంగ్రెస్ నాయకులు ఘర్షణ పడ్డ సంఘటన ఖమ్మం నగరంలోని ఎనిమిదవ డివిజన్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఎనిమిదవ డివిజన్ పరిధిలో గతంలో ప్రభుత్వ భూమిని కొంత మంది పేదలకు ఇండ్ల స్థలాలు మంజూరు చసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు లబ్దిదారులు ఎవరు అక్కడ ఇండ్లు నిర్మించుకో లేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు శ్రావణ్ ఆ స్థలాన్ని చదును చేయిస్తుండగా తాజా మాజీ కార్పొరేటర్ సైదులు ఆ ప్రాంతానికి వెళ్లి ఎందుకు చదును చేయిస్తున్నావు ఆ స్థలాన్ని రెవెన్యూ అధికారులు చూసుకుంటారని శ్రావణ్‌కు సూచించారు. ఈ నేపథ్యంలో శ్రావణ్ , సైదులు మధ్య వాగ్వివాదం చేసుకుని ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో సైదులు గాయపడ్డాడు. దీనికి సంబంధించి ఇరువురు ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువురు కాంగ్రెస్ పార్టీ నేతలు కావడం ఒకరు మాజీ కార్పొరేటర్, మరొకరు అధికార పార్టీ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసేందుకు టికెట్ ఆశిస్తుండడంతో కాంగ్రెస్ పార్టీలో ఈ ఘర్షణ చర్చ నీయాంశమైంది.

# సమస్యల కోసం పోరాడేది ఎర్రజెండానే..

**-సిపిఐ జిల్లా సమితి సభ్యులు చింతల**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడేది ఎర్రజెండానేనని సిపిఐ జిల్లా సమితి సభ్యులు చింతల రమేష్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని పువ్వాడ ఉదయ్ నగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సిపిఐ దిమ్మెను చింతల రమేష్ జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పేద ప్రజల ఇండ్ల స్థలాల కోసం తుదిశ్వాస వరకు పోరాడిన మహోన్నత వ్యక్తి పువ్వాడ ఉదయ్‌కుమార్ అన్నారు. అటువంటి వ్యక్తి పేరుతో పువ్వాడ ఉదయ్ నగర్ ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. ఈ గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరాటాలు సాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానోత్ నాగేశ్వరరావు, నాదెండ్ల పుల్లయ్య, గుండ్ల అశోక్, వెంకటేశ్వర్లు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మండల విద్యాశాఖ అధికారిగా శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల వనరుల కేంద్రంలో నూతన ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించి రిజిస్టర్‌లో తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం చేస్తున్న కార్యక్రమాలను పాఠశాలలో మంచిగా అమలయ్యే విధంగా చూసి ఉపాధ్యాయులను కార్యోన్ముఖులను చేసి విద్యాభివృద్ధిలో ముందు ఉండటం కోసం ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నంబూరు కనకదుర్గ, గరికపాడు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు డి.సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘం నాయకులు పిఆర్‌టియు వెలిశెట్టి నర్సింహారావు, వేమిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, యుటిఎఫ్ భాస్కరరావు, సుధాకర్, టిపిటిఎఫ్ విజయ్, నాగేశ్వరరావు, ఎస్‌టిఎఫ్ పెనుగొండ ఉపేందర్‌రావు, ఎస్టియు కరుణాకర్‌రావు, ఉపాధ్యాయులు, ఎంఆర్పి స్టాఫ్ పాల్గొన్నారు.

## లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డులు




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఇటీవల లొంగిపోయిన వివిధ క్యాడర్లకు చెందిన మావోయిస్టులకు శనివారం ఎస్‌పి చేతుల మీదుగా రివార్డుల చెక్కులను అందజేశారు. వివిధ క్యాడర్లకు చెందిన పది మంది సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.55 లక్షల 60 వేలను చెక్కుల రూపంలో అందించారు. లొంగిపోయిన సమయంలో ఏఏ క్యాడర్లకు చెందిన వారు ఉన్నారో దానిని బట్టి వారికి రివార్డు అందజేశారు. రివార్డు అందుకున్న వారిలో స్టేట్ కమిటీ మెంబర్ 1, డివిజనల్ కమిటీ మెంబర్ 1, ఏరియా కమిటీ మెంబర్ 06, దళసభ్యులు ఇద్దరు ఉన్నారు. చెక్కులు అందజేసే సమయంలో ఎస్‌పి వారితో మాట్లాడుతూ ప్రస్తుతం వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రివార్డు ద్వారా అందుకున్న సొమ్ములను విలాసాల కోసం కాకుండా సక్రమమైన పద్ధతిలో జీవనోపాధి కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లా పోలీసులు చేపట్టిన ఆపరేషన్ చేయూత కార్యక్రమాల్లో భాగంగా ఆకర్షితులై లొంగిపోయిన మావోయిస్టులకు జిల్లా పోలీస్‌శాఖ అండగా ఉంటుందని ఎస్‌పి తెలిపారు. లొంగిపోయిన వారికి పునరావాసంతో పాటు ప్రభుత్వం తరుపున అందాల్సిన అన్ని రకాల ప్రతిఫలాలను అందిస్తున్నారని చెప్పారు.

## క్రీడాకారులను అభినందించిన డిఎస్‌పి



ప్రజాపక్షం/పాల్వంచ : జాతీయ స్థాయిలో మెరుగైన ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని, క్రీడల్లో రాణించి ఉజ్వల భవిష్యత్‌కు చేరుకోవాలని పాల్వంచ డిఎస్‌పి సతీష్ కుమార్ ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ 2026లో రాణించి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన పాల్వంచ ప్రశాంత్‌నగర్‌కు చెందిన చిన్నారులు బొమ్మ రోజన, తాన్విలతో పాటుగా కోచ్ రాంబాబులను పాల్వంచ డిఎస్‌పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో పాటుగా విద్యలో కూడా రాణించాలని సూచించారు.

## పిల్లల ఎదుగుదలకు టీకాలు దోహదం



ప్రజాపక్షం/పాల్వంచ : చిన్నారులు ఆరోగ్యంగా ఎదగటానికి టీకాలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా శిశు ఆరోగ్య, టీకాల అధికారి ప్రతాప్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తుకారాం రాథోడ్ ఆదేశాలతో మండల పరిధి ఉల్వనూర్ ప్రభుత్వ గిరిజన ఆసుపత్రి పరిధి రాజీవ్ నగర్ కాలనీ గొత్తికోయ గుంపులో నిర్వహించిన అవుట్ రీచ్ టీకాల కార్యక్రమాన్ని ప్రతాప్ శనివారం సందర్శించి, వ్యాక్సినేషన్ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పని సరిగా టీకాలు వేయించాలని సూచించారు. ఇంటింటి సర్వే చేసిటీకాలు తీసుకోని, డ్రాపవుట్, లెఫ్ట్ అవుట్ పిల్లలను గుర్తించారు. తల్లిదండ్రులకు టీకాల ప్రయోజనంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ నాగభూషణం, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నన్ను ప్రభుత్వమే ఆదుకోవాలి

### రైతు వెంకటనారాయణ



ప్రజాపక్షం/కరకగూడెం: పామాయిల్ తోట కు నిప్పు అంటుకొని పామాయిల్ తోట చెట్లు కాలిపోవడంతో కష్టాల ఓ రైతు కష్టాల ఉబిలో కూరుకుపోయాడు. వివరాలోకి వెళితే.. కరకగూడెం మండలం తాటిగూడెం గ్రామంకు చెందిన పోలేబోయిన వెంకటనారాయణ అనే రైతు గత సంవత్సరం సుమారు 3 ఎకరాలలో 1 లక్ష రూపాయలతో పామ్ ఆయిల్ మొక్కలు వేసి సాగు చేస్తున్న తరుణంలో గురువారం రోజున మధ్యాహ్నం సమయంలో ఆకస్మాతుగా నిప్పు అంటుకొని మొక్కలు కాలిపోయి ఆ రైతుకు నష్టాలను మిగిల్చింది. పంట ఎదుగుతున్న సమయంలో ఇలా జరగడం ఆ రైతుకు తీరని నష్టాన్ని తెచ్చిపెట్టిందని చెప్పవచ్చు. ఆ కాలిన తోటను చూసి చలించిపోయిన రైతు ఆవేదనతో ఇటువంటి సమయంలో ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరుకుంటున్నాడు.

## లక్ష్మీపురం హత్య కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలోని ఐటీసీ లారీ యార్డు సమీపంలో ఇటీవల జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పాల్వంచ సిఐ సతీష్, బూర్గంపాడు ఎస్ఐ మేడ ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రానికి చెందిన కుందన్ సింగ్, ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన దానియల్ నాగ్, విజయవాడకు చెందిన లక్ష్మణ్ రాయల్ ఆటో పార్ట్స్ వద్ద లారీ మెకానిక్‌లుగా పని చేస్తూ అక్కడే నివసిస్తున్నారు. అదే ప్రాంతంలో కరీంనగర్‌కు చెందిన శ్రావణ్ కూడా లారీ మెకానిక్‌గా పని చేస్తూ వేరే గదిలో ఉంటున్నాడు. ఈనెల 10వ తేదీ రాత్రి కుందన్ సింగ్, శ్రావణ్ మధ్య మద్యం మత్తులో గొడవ జరిగింది. ఈ గొడవను మనసులో పెట్టుకున్న శ్రావణ్ 11వ తేదీన తెల్లవారుజామున 3:30గంటల సమయంలో కుందన్ సింగ్‌పై బండరాయితో దాడి చేసి హత్య చేసినట్లు వెల్లడించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించిందన్నారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**




ప్రజాపక్షం/మణుగూరు: పెంచిన పెట్రోల్ ,డీజిల్ గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం మణుగూరు సిపిఐ పార్టీ కార్యాలయం ఎదుట సిపిఐ పార్టీ నాయకులు ఎర్రజెండాలు చేత పట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ మొన్న జరిగినటువంటి ఐదు రాష్ట్రాల ఎన్నికలలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచమని ఎలక్షన్లు అయిపోయిన తర్వాత పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు వెంటనే పెంచడం సరైన విధానం కాదని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట మీద నిలబడకుండా పేద, మధ్య తరగతి ప్రజలపై పెనుబారం మోపుతూ సామాన్యుడిపై ఆర్థిక భారాన్ని మోపుతున్నారని వారు ఆరోపించారు. నరేంద్ర మోడీ మరలా అధికారంలోకి చేతబడిన తర్వాత సామాన్యుడిపై మోయలేని భారం మోపుతూ కార్పొరేట్ రంగాలకు కొమ్ముకాస్తూ సామాన్య, పేద, మధ్య, తరగతి కుటుంబాలకు పెనుబారం మోపుతూ పేద వర్గాల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని వారు అన్నారు. ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేస్తూ ఈడి సిబిఐ పేరుతో బెదిరింపులు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తమ విధానాలు మార్చుకోవాలని ఎన్నికల ముందు దేశ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని లేకుంటే ప్రజా అగ్రహానికి గురికావాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వరరావు, రాష్ట్ర సమితి సభ్యులు స రెడ్డి పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్ , మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, జిల్లా సమితి సభ్యులు మోహన్ రావు, పట్టణ కార్యదర్శి దుర్గ, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, జిల్లా సమితి సభ్యులు వై రామ్ గోపాల్, ఎడారి రమేష్, సోందే కుటుంబరావు, సీనియర్ నాయకులు గడ్డం మనోహరా చారి, తోగటి కుమార్, ఎస్కే సర్వర్, తోట రమేష్, కామిశెట్టి రామారావు, ఎస్ కే సర్వర్, గడ్డం వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సీతారాములు, వేల్పుల నరేష్, ఎస్వీ నాయుడు, పులిగల రమేష్, బాడిస సతీష్, నోముల రవి, వజ్జా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మిక హక్కుల కోసం ఎఐటియుసి పోరాటం

**-మణుగూరు బ్రాంచి సెక్రటరీ వై. రాంగోపాల్**
**-మణుగూరు ఓసీ నుండి ఏఐటియుసిలో భారీ చేరికలు**
**-సొంత గూటికి చొప్ప సుధాకర్**




ప్రజాపక్షం/మణుగూరు: సింగరేణి భవిష్యత్ కోసం ఏఐటీయూసీ ఆరాటంతో పాటు కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ పోరాటం చేస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచి సెక్రటరీ వై. రాంగోపాల్ అన్నారు. మణుగూరు ఓసి లో జరిగిన గేట్ మీటింగులో అయన మాట్లాడుతు మెడికల్ బోర్డు (డిపెండెంట్స్)కి నియామక పత్రాలు పెర్క్స్ పై ట్యాక్స్ రూ. 91 కోట్ల చెల్లింపు, కార్మికుడి సొంత ఇంటి కళ, తదితర డిమాండ్ల పరిష్కారనికి యాజమాన్యం హామీ ఇచ్చిందని ఏఐటియూసి కి సింగరేణి యాజమాన్యంకి మధ్య జరిన సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చల వివరాలను తెలియజేశారు.

**మణుగూరు ఓసి నుండీ ఏఐటియూసి లో చేరికలు...**

చొప్ప సుధాకర్, వెంకటేష్, అనిల్, సురేష్, దీపక్, అశోక్, శ్రీనివాస్ తదితరులను వై. రాంగోపాల్ ఆదేర్ల సురేందర్ ఏఐటీయూసీ కండువా కప్పి యూనియన్ లోకి ఆహ్వానం పలికారు. ఫిట్ సెక్రెటరీ వి. సాయి ప్రకాష్ అధ్యక్షతన జరిగిన మణుగూరు ఓ.సి సమావేశంలో పాల్గొన్న అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ చొప్ప సుధాకర్, ఉపేందర్ ఫోర్మన్, రాంబ్రహ్మం, మంద కోటేశ్వరరావు, రమేష్, సురేష్, పరమేష్, త్రినాథ్, శంకర్, సలీం పాషా, నవీన్, పాటి ప్రసాద్, బీచ్చు, రత్న తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించాలి

**-విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన సదస్సు**



ప్రజాపక్షం/బూర్గంపాడు: భద్రాద్రి కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బూర్గంపాడు మండలంలోని బూర్గంపాడు గ్రామంలో వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘ సభ్యులకు విత్తనోత్పత్తిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి అధ్యక్షత వహించిన కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా టి భరత్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాలను ఎంపిక చేసుకొని సాగు చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన వరి రకాలు మంచి దిగుబడులతో పాటు మార్కెట్‌లో ఆదరణ పొందుతున్నాయని తెలిపారు. అలాగే కృషి విజ్ఞాన కేంద్రం సాంకేతిక సహకారంతో వరి, కంది పంటల్లో విత్తనోత్పత్తి చేపడుతున్న వివరాలను రైతులకు వివరించారు. అనంతరం బూర్గంపాడు వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘ అధ్యక్షులు బిక్కసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడుల కోసం మోతాదుకు మంచి రసాయన ఎరువులు వినియోగించడం వల్ల భూసారం తగ్గిపోతుందని హెచ్చరించారు. భూమిసారాన్ని కాపాడేందుకు జీలుగ, జనుము, పిల్లి పెసర, పెసర, మినుము వంటి పచ్చిరొట్ట పైర్లను సాగు చేసి భూమిలో కలపాలని సూచించారు. అనంతరం ఉద్యాన శాస్త్రవేత్త బి శివ మాట్లాడుతూ రైతులు ఒకే రకమైన పంటలను సాగు చేయడం వల్ల గిట్టుబాటు తగ్గుతోందన్నారు. పంట మార్పిడి విధానాన్ని పాటించడం ద్వారా రైతులు సుస్థిర ఆదాయం పొందటంతో పాటు నేల ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించుకోవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సీఈఓ, సభ్యులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు. సుమారు 25 మంది రైతులు ఈ అవగాహన సదస్సులో పాల్గొని పలు సూచనలు, సలహాలను తెలుసుకున్నారు.

# చంద్రుగొండలో జాతీయ డెంగ్యూ దినోత్సవం



ప్రజాపక్షం/చంద్రుగొండ: చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ నివారణపై ప్రజల్లో చైతన్యం కల్పించేలా శ్లోగన్లతో ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి హరికృష్ణ మాట్లాడుతూ డెంగ్యూ దోమ చిన్నదైనా, దాని వల్ల కలిగే ప్రమాదం చాలా పెద్దది అని అన్నారు. డెంగ్యూ దోమ కాటుతో వచ్చే జ్వరంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా పాటిస్తూ గ్రామాల్లో నిల్వ నీటిని తొలగించడం, నీటి పాత్రలను మార్చడం, ఇంటి చుట్టు పక్కల పరిశుభ్రత పాటించడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చని వివరించారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు ఎస్ పూర్ణారావు, పి విజయశ్రీ, సిస్టర్స్, ఆశా కార్యకర్తలు, ల్యాబ్ టెక్నీషియన్, మేల్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.

# ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

**- పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి**
**- సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా, నిరసన**







ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : నిత్యవసరాల ధరల నియంత్రణలో కేంద్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సలిగంటి శ్రీనివాస్, కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య విమర్శించారు. దేశంలో పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ శనివారం కొత్తగూడెం పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద సిపిఐ, ఏఐటియూసి ఆధ్వర్యంలో భారీ ధర్నా, నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల సామాన్యునిపై మోయలేని భారం పడుతోందని, ఆకాశాన్ని అంటుతున్న నిత్యవసర వస్తువుల ధరలను తక్షణమే అదుపు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ స్థాయిలో చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ దేశంలో మాత్రం కార్పోరేట్ సంస్థల చమురు దోపిడీ సాగుతోందని, దీనిని అరికట్టడానికి ఇంధన ఉత్పత్తులను వెంటనే జీఎస్‌టి పరిధిలోనికి తేవాలన్నారు. వంట గ్యాస్ ధరలను తగ్గించి గతంలో ఉన్న సబ్సిడీని పనరుద్దరించాలని, పేదలను ఆదుకునేందుకు రేషన్ దుకాణాల ద్వారా అన్ని రకాల నిత్యవసరాలను సరఫరా చేయాలని, లేనిపక్ష్యంలో పెంచిన ధరలకు వ్యతిరేకంగా ప్రజాపోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, ఎస్‌కే ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు నెరేళ్ల రమేష్, పార్టీ ప్రజాసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు మాచర్ల శ్రీనివాస్, ఎండి యూసుఫ్, ధర్మరాజు, బోయిన విజయ్ కుమార్, గుమ్మడెల్లి దుర్గయ్య, ఖయ్యూమ్, లక్ష్మీ నారాయణ, ధనరాజ్, ఇర్ఫాన్, జహీర్, షాహీన్ రసూల్, బడుగు భాస్కర్, ఆరెల్లి కృష్ణ, అజయ్, బాబు జానీ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కూపన్లు మంజూరు చేయాలి

**-తహసీల్దార్‌కు ఉప సర్పంచ్ వినతి**



ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు గ్రామ పంచాయితీ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు వెంటనే ఇసుక కూపన్లు మంజూరు చేసి ఇసుక కొరత నివారించాలని ఉప సర్పంచ్ గుండె వెంకన్న తహసీల్దార్‌ను కోరారు. ఈ మేరకు ఆయన గ్రామ పంచాయితీ పాలకవర్గ సభ్యులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయితీ పరిధిలో సుమారు 51 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ప్రస్తుతం ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో తీవ్ర ఇసుక కొరత ఏర్పడి లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అలాగే వర్షాకాలంలో బురదమయం అయ్యే దారులకు సీసీ రోడ్లు కూడా మంజూరు కావడంతో అభివృద్ధి పనులకు కూడా ఇసుక అత్యవసరమైందన్నారు.ప్రజాప్రతినిధులు గా లబ్దిదారులకు సమాధానం చెప్పలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటూ, వెంటనే ఇసుక కూపన్లు మంజూరు చేసి పేదల ఇళ్ల నిర్మాణాలకు సహకరించాలని తహసీల్దార్‌కు కోరారు. ఈకార్యక్రమంలో పంచాయితీ పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# అన్నపురెడ్డిపల్లి ఫోర్ వే పనులకు బ్రేక్..!

**-బిల్లుల జాప్యంతో నత్తనడకన నిర్మాణం**
**-దుమ్ముతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు**



ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఫోర్‌వే రహదారి పనులు తీవ్ర జాప్యానికి గురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలల తరబడి కొనసాగుతున్న పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో స్థానికుల్లో అసహనం వ్యక్తమవుతోంది. గుత్తేదారుకు ప్రభుత్వం నుంచి బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడంతోనే పనులు నత్తనడకన సాగుతున్నాయని స్థానికంగా చర్చ జరుగుతోంది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రోజూ భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో రోడ్డు మొత్తం దుమ్ముతో కప్పుకుపోతోంది. దీంతో వ్యాపారులు, విద్యార్థులు, వృద్ధులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి పక్కన ఉన్న దుకాణాలపై దుమ్ము పేరుకుపోవడంతో వ్యాపారం దెబ్బతింటోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణ పనుల కోసం పాత రహదారిని తవ్వి అలాగే వదిలేయడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ఎండ తీవ్రత పెరిగితే దుమ్ము మబ్బులు, వర్షం పడితే బురదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా సరైన చర్యలు కనిపించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. భారీ వాహనాలు వేగంగా ఎగిసిపడుతున్న దుమ్ము కారణంగా చిన్నారులు శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో సరైన లైటింగ్, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాల భయం వెంటాడుతోందని వాహనదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుత్తేదారుకు పెండింగ్ బిల్లులు విడుదల చేసి ఫోర్‌వే పనులను వేగవంతం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మండల కేంద్రానికి ప్రధాన రహదారిగా ఉన్న ఈ పనులు త్వరగా పూర్తైతేనే ప్రజలకు ఉపశమనం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజల్లో చైతన్యం నింపిన మిషన్ భగీరథ అవగాహన సదస్సు



ప్రజాపక్షం/బూర్గంపాడు: గ్రామీణ ప్రజలకు సురక్షిత తాగునీటి ప్రాముఖ్యతను తెలియజేస్తూ బూర్గంపాడు గ్రామ పంచాయితీలో శనివారం మిషన్ భగీరథ నీటి నాణ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. మిషన్ భగీరథ ఇంట్రా విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీరబ్రహ్మదేవ్, మండల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ మందా నాగరాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. మణుగూరు మిషన్ భగీరథ ఇంట్రా విభాగానికి చెందిన నీటి నాణ్యత పరీక్షల ప్రయోగశాల సిబ్బంది అహద్ పాషా, వెంకట్ మహారాజ్ ప్రజలకు నీటి నాణ్యత ప్రమాణాలపై వివరంగా అవగాహన కల్పించారు. భూగర్భజలం, మినరల్ వాటర్, మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి మధ్య ఉన్న తేడాలను శాస్త్రీయంగా వివరిస్తూ ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించారు.ప్రజలు మిషన్ భగీరథ నీటిని నమ్మకంతో వినియోగించి ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని సూచించారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి ప్రభాకర్, ఉప సర్పంచ్ గుండె వెంకన్న, పంచాయితీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి




ప్రజాపక్షం/పాల్వంచ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విధానాలతో సామాన్య, పేద ప్రజలపై పెను భారం పడుతోందని పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావులు డిమాండ్ చేశారు. ఈ నెల 15వ, తేదీ అర్ధరాత్రి కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా పాల్వంచ సిపిఐ ఆధ్వర్యంలో శనివారం కిన్నెరసాని రహదారిలో కేంద్ర ప్రభుత్వ,ప్రధానమంత్రి నరేంద్రమోడి దిష్టబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వం కార్పోరేట్ వర్గాలకు అనుకూలంగా పేద మధ్య తరగతి ప్రజలకు వ్యతిరేకంగా పాలన సాగిస్తున్నదని మండిపడ్డారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలను పెంచి ప్రజలపై పెనుభారం మోపారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు వీసంశెట్టి విశ్వేశ్వర్‌రావు, వీ. పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, సిపిఐ ప్రజా సంఘాల నాయకులు శనిగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, ఎస్‌ఏ. రహమాన్, ఎస్‌కే.గౌస్, హైమద్ జానీ, కరీం, నామా పండు, కాకటి వెంకన్న, అల్లి వెంకటేశ్వర్లు, లక్ష్మి, విజయ, పద్మ, హెచ్. వెంకటేశ్వర్లు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వం



ప్రజాపక్షం/కారేపల్లి: దేశ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడాన్ని నిరసిస్తూ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో పోలంపల్లిలో శనివారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ నాయకులు గుగులోత్ తేజ నాయక్ మాట్లాడుతూ పెరిగిన ఇంధన ధరల వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో పెరగని ఇంధన ధరలు ఎన్నికలు పూర్తయ్యాక పెరగడం ప్రజల్లో అనేక అనుమానాలు, ఆందోళనలకు తావిస్తోందన్నారు. దేశ అభివృద్ధి పేరుతో ఎన్నికల సమయంలో ప్రజల మద్దతు కోరిన బీజేపీ ప్రభుత్వం ప్రస్తుతం ధరల పెంపుతో ప్రజలపై భారాలు మోపుతోందని ఆరోపించారు. వెంటనే పెంచిన ఇంధన ధరలను పునఃసమీక్షించి తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ సింగరేణి మండల నాయకులు పులకాని సత్తిరెడ్డి, రావుల నాగేశ్వరరావు, ధరావత్ సక్రు నాయక్, గుగులోతు రాము, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విద్యా వారోత్సవాలు



ప్రజాపక్షం/కూసుమంచి: ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా కూసుమంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యా వారోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయితీల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈసందర్భంగా కూసుమంచి గ్రామ పంచాయితీ సర్పంచ్ కొండ కృష్ణవేణి, గురువాయిగూడెం సర్పంచ్ బానోతు బిక్షం మాట్లాడుతూ మండలంలోని 41 గ్రామ పంచాయితీ సర్పంచులు పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు పొందేలా చైతన్యం కల్పించాలని కోరారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వ విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ఈసందర్భంగా 2026 విద్యా సంవత్సరంలో మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు షీల్డ్‌లు, బహుమతులు అందజేసి సత్కరించారు.

## డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి




ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్‌వో వాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది డెంగ్యూ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగ్యు నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తూ ఇంటి చుట్టు పక్కల నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటే డెంగ్యూ వ్యాప్తిని సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. ఈసందర్భంగా ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యానికి రక్షణ కవచమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరా డెయిరీ అమలుకు సమగ్ర కార్యాచరణ

**-నిధులు వృధా కాకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలి**
**-ఇందిరా మహిళా డెయిరీపై కలెక్టర్ సమీక్ష**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమం అమలుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిశాఖకు కేటాయించిన లబ్ధిదారుల లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ విడుదల అనంతరం అందుబాటులో ఉన్న నిధుల ప్రకారం ప్రాధాన్యత క్రమంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పశువుల యూనిట్ల గ్రౌండింగ్‌కు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. బడ్జెట్ త్వరగా విడుదలయ్యేలా ఎస్సి, ఎస్టి, మైనార్టీ శాఖల ఉన్నతాధికారులతో జిల్లా కలెక్టర్ ఫోన్ ద్వారా మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. విడుదలైన నిధులు సక్రమంగా వినియోగమయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. నిధులు వృధాకాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమానికి అవసరమైన గ్రామస్థాయి మండల స్థాయి, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను సమాంతరంగా చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు అవసరమైన పరిపాలన అనుమతులు వెంటనే పొందాలని సూచించారు. జిల్లాలో సభ్యులకు మంజూరైన పశువుల షెడ్ల నిర్మాణానికి సంబంధించి ఆసక్తి చూపిస్తూ పనులు చేపట్టే లబ్ధిదారులను ఎంపిడివోలు గుర్తించాలని ఆదేశించారు పశువుల షెడ్ల నిర్మాణం పటిష్టంగా, నాణ్యతతో ఉండేలా చూడాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సోలార్ వ్యవస్థ ఏర్పాటును కూడా చేపట్టాలని ఆదేశించారు. ఇందిరా మహిళా డెయిరీ వచ్చే రెండేళ్లలో పూర్తి స్థాయి స్వయం సమృద్ధి సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. డెయిరీ స్థిరత్వం కోసం ఎంత మేర పాలు సేకరించాలి సేకరించిన పాలను ఎక్కడ విక్రయించాలి అనే అంశాలపై పూర్తి స్థాయి కార్యాచరణ ప్రణాళికను వచ్చే మంగళవారం లోపు సమర్పించాలన్నారు. గరిష్టంగా 10 రోజుల ఆపరేషనల్ వ్యయాన్ని పరిగణలోకి తీసుకుని ఆర్థిక ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఇందిరా మహిళా డెయిరీ నిర్వహణలో ఆదాయం, వ్యయం, పాల సేకరణ, మార్కెటింగ్ తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ పకడ్బందీగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో శ్రీరామ్, సిపివో శ్రీనివాస్, బిసి అభివృద్ధి అధికారి జి. జ్యోతి, ఇంచార్జి ఎస్టి కార్పోరేషన్ ఈడి, జిల్లా మైనార్టీ అభివృద్ధి అధికారి ముజాహిద్, పశు సంవర్ధక శాఖాధికారి డా॥ పురంధర్, పంచాయతీ రాజ్ ఈఈ మహేష్, విజయ డెయిరీ డిడి కె. రవికుమార్, డిఆర్‌డివో, ఏపిడి జయశ్రీ, వ్యవసాయ శాఖ ఏడిఏ ఎస్. విజయచంద్ర, ఏపిఎం, ఎంపిడివోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎన్‌ఎస్‌పి కాల్వపై ఇళ్ల అమ్మకాలు..!

**రూ.10లక్షలు పైమాటే...**




**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌ఎస్‌పి కాల్వపై ఆక్రమించుకున్న స్థలాలను నిర్మించిన ఇళ్లను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కొక్క ఇంటిని సుమారు రూ.10లక్షల వరకు విక్రయిస్తున్నారు అని జోరుగా ప్రచారం జరుగుతుంది. ఖాళీ స్థలం కనబడితే కబ్జా చేయడం ఆపైన నిర్మాణం చేపట్టడం, కొన్ని రోజుల తర్వాత వాటిని అమ్మడం ఇది ఒక వ్యాపారం లాగా మారింది. నిజమైన నిరుపేదలకు ఉండటానికి ఇళ్లు లేక స్థలం లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. కాని కొంతమంది స్థలాలను ఆక్రమించడం ఇళ్లు నిర్మాణం చేపట్టడం అమ్మడం జోరుగా కొనసాగుతుంది. ఎన్ఎస్‌పి కెనాల్‌పై ఇప్పటికే పెద్ద ఎత్తున ఆక్రమణలు జరిగి నిర్మాణాలు చేపట్టారు. అయ్యప్పస్వామి ఆలయం సమీపంలోని శాంతినగర్ నుండి వైరా పట్టణంలోకి ఉన్న ఎన్ఎస్‌పి కాల్వ పూర్తిగా ఆక్రమణ కోరల్లో మునిగిపోయింది. ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లు నిర్మించేందుకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రణాళికను రూపొందిస్తుంది. కాని వైరాలో ఖాళీ జాగా కనిపించిందా ప్రభుత్వ భూమి అయితే రేకులు వేయడం ఆ తర్వాత దానిని అమ్మి నగదు చేసుకో అనే రీతిలో కొంతమంది వ్యవహార శైలి కొనసాగుతుంది. గతంలో పలుమార్లు ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని అధికార యంత్రాంగం పదేపదే హెచ్చరించిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం వైరాలోని ఎన్ఎస్‌పి కెనాల్‌పై నిర్మించుకున్న ఇళ్లలో కొంతమంది దళారి వ్యవస్థను ప్రోత్సహించి వాటిని ఇప్పుడు రూ.10లక్షలకు విక్రయాలు జరుగుతున్నాయి. అని గత 20 రోజుల నుండి ఈ తతంగం వైరాలో చర్చనీయాంశంగా మారింది. అధికారులు ఇప్పటికైనా నిజమైన నిరుపేదలకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వ స్థలాలు ఇళ్ల స్థలాలు లేని వారికి ఇచ్చి ఆదుకునేందుకు చర్యలు చేపట్టి పదేపదే ప్రభుత్వ భూములు ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపట్టి అమ్ముతున్న వారిపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం





**ప్రజాపక్షం/వైరా:** వైరాలో వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని నిరసన చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకూరు రమేష్, దేవకి వాసుదేవరావు, జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు, ఆపద రామారావు, నున్నా రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగాబిజెజి జాతీయ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తెచ్చిన వరి ధాన్యం, మొక్కజొన్న పంటలను నెలరోజులుగా కొనుగోలు చేయకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారని విమర్శించారు. ఇదే అదునుగా చూసిన మిల్లర్లు తరుగు పేరుతో దోచుకుంటున్నారని విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలను వెంటను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వరి, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేయాలని ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రధాన మోడీ అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ కన్వీనర్, మనుబోలు వెంకటకృష్ణ, లగడపాటి నాగార్జున, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్‌ఎస్‌ఏ మీట్‌లో ఖమ్మం జిఎంసీ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం :** ఖమ్మం గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ విద్యార్థులు 23వ ఆర్ఎస్ఏ మీట్2026లో ప్రతిభ కనబరిచి కళాత్మక ప్రతిభలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఉస్మానియా మెడికల్ కాలేజ్‌లో నిర్వహించిన ఈ రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో జిఎంసీ ఖమ్మం విద్యార్థులు పాల్గొని అనాటమీ ఆర్టిస్ట్రీ విభాగంలో 7వ స్థానం సాధించారు. ఈ పోటీలో 3వ సంవత్సరం విద్యార్థులు ప్రణవి, సౌగంధి, రిక్కిన్ పాల్గొన్నారు. అలాగే 2వ సంవత్సరం విద్యార్థులు ఉజైర్, మహేశ్వరి, ప్రత్యూష, మనోతేజ, రోహిణి తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. 1వ సంవత్సరం విద్యార్థులు లక్ష్మీ ప్రియా, లోహిత, ఐశ్వర్య కూడా ఈ బృందంలో భాగమై ప్రతిభ చాటారు. మానవ శరీర నిర్మాణ శాస్త్రాన్ని కళారూపంలో ఆవిష్కరించిన ఈ బృందం తమ వినూత్న ప్రదర్శనతో అందరి ప్రశంసలు అందుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ మెడికల్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలో జిఎంసీ ఖమ్మం విద్యార్థులు సాధించిన విజయం కళాశాలకు గర్వకారణమైంది. విద్యార్థుల ఈ విజయంపై ప్రిన్సిపాల్ డాక్టర్ టి శంకర్, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు భవిష్యత్‌లో కూడా ఇలాంటి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# సైబర్ నేరస్తుడు అరెస్ట్



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో లింక్‌లు పంపి వాటి ద్వారా పద్దెనిమిది లక్షల రూపాయల వరకూ కాజేసి మోసం చేసిన సైబర్ మోసగాడిని ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించి పోలీసు కమిషనర్ సునిల్‌దత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావారం జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన సింగంశెట్టి సురష్ ఖమ్మం జిల్లా చెందిన ఒక ఉద్యోగికి వాట్సప్‌లో పరిచయడం ఆయ్యాడు. ఆన్‌లైన్ ట్రైడింగ్‌లో పెట్టుబడులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మబలికాడు. ఇందుకు సదరు ఉద్యోగి సెల్‌కి వాట్సాప్ ద్వారా ట్రేడింగ్ లింక్‌లు పంపి వాటిని ఓపెన్‌చేసి సదరు వాటిలో పెట్టుబడులు పెట్టాలని సూచించడంతో సదరు బాధితుడు విడతల వారిగా సుమారు 18 లక్షల రూపాయల వరకు ఇన్‌వెస్ట్‌మెంటు చేశాడని తెలిపారు. కొంత కాలానికి సురేష్ స్పందిచకపోవడంతో మోసపోయినట్లు గమనించి స్థానిక సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైం పోలీసులు కేసు దర్యాప్తు చేసి లావాదేవీలు జరిపిన బ్యాంక్ అకౌంట్ ఆధారంగా నిందితుడు పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం కు చెందిన సురేష్‌గా గుర్తించి అక్కడికి వెళ్లి శనివారం అరెస్ట్ చేశారు. నిందితుడిని ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సిపి తెలిపారు. కేసును త్వరితగతిన చేధించడంలో నేర్పుకనబరిచిన సైబర్ క్రైం డిఎస్‌పి సిహెచ్ ఆర్ వి ఫణింధర్, సిఐ భూక్యా రవికుమార్, ఎస్ఐలు రంజిత్‌కుమార్, విజయ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రావు, కానిస్టేబుళ్లు భానుమూర్తి, కృష్ణప్రసాద్, నాగేశ్వరరావు, స్టేషన్ సిబ్బందిని సిపి సునిల్‌దత్ అభినందించారు.

# పరీక్ష కేంద్రాల వద్ద బిఎన్‌ఎస్‌ఎస్ యాక్ట్ అమలు



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఖమ్మం కమిషనరేట్ పరిధిలో నేడు జరుగనున్న జెఈఈ అడ్వాన్స్‌డ్ మెయిన్స్ ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద బిఎన్ఎస్ఎస్ 163 యాక్ట్ అమలులో ఉంటుందని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 5.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాలకు రెండు వందల మీటర్ల దూరం వరకూ ఇద్దరుకి మిచ్చి ఎక్కువ మంది సంచరించరాదన్నారు. గుంపులు గుంపులుగా తిరగటం , ఊరేగింపులు, ర్యాలీలు, ధర్నాలు, లౌడ్ స్పికర్‌తో ప్రచారాలు నిషేదమన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లు, స్టేషనరీషాపులు మూసివేయాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలకుండా ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేసి రాకపోకలను క్రమబద్ధీకరించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బిఎన్‌ఎస్ఎస్ యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ, వివిధ సంఘాల నాయకులు, స్థానికులు పోలీసులకు సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# బదిలీ సిబ్బందికి సన్మానం



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఖమ్మం పోలీసు కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహించి బదిలీపై కొత్తగూడెం ఐదవ బటాలియన్‌కు వెళ్తున్న మినిస్టీరియల్ సిబ్బంది సెక్షన్ సూపరిండెంట్ జానకీరామ్, సీనియర్ అసిస్టెంట్ షరీఫ్‌ను పోలీసు కమిషనర్ సునిల్‌దత్ శనివారం తనకార్యాలయంలో సన్మానించి విడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకూ వారు అందించిన సేవలను కోనియాడారు. కొత్త స్థానంలో కూడా విజయవంతంగా విధులు నిర్వహంచి అందరి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఓ చంద్రకళ, పలువురు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గోవుల అక్రమ రవాణాపై పోలీసుల ఉక్కుపాదం




**-122 గోవులు పట్టివేత, లారీ స్వాధీనం**
**-నలుగురు అరెస్ట్, పరారీలో మరికొందరి కోసం గాలింపు**
**-అక్రమ రవాణాదారులకు డీఎస్పీ ఆదినారాయణ హెచ్చరిక**

**ప్రజాపక్షం/చండ్రుగొండ:** అక్రమ గోవుల రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఎటువంటి అనుమతులు లేకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్న 122 గోవులను పట్టుకొని, వాటిని తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్ట్ చేసిన ఘటన జిల్లాలో కలకలం రేపింది. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ వివరాలు వెల్లడించారు. స్థానిక ఎస్ఐ శివరామకృష్ణ ఆధ్వర్యంలో మహమ్మద్‌నగర్ గ్రామంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించగా, ఏపీ29యూ4656 నంబర్ లారీలో అక్రమంగా తరలిస్తున్న 122 గోవులను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ అక్రమ రవాణా వెనుక మోయిజ్ అనే వ్యక్తి కీలక సూత్రధారిగా వ్యవహరిస్తున్నాడని, అతను ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి పశువులను కొనుగోలు చేసి ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తూ అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నాడని వెల్లడించారు. ఈ వ్యవహారంలో సహకరించిన మహమ్మద్‌నగర్‌కు చెందిన ఇస్మాయిల్, నాగుల్ మీర పీర్, లారీ డ్రైవర్ ఖాజాపాషా, క్లీనర్ మహమ్మద్ ఖురేషిలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. అక్రమ రవాణాలను అరికట్టేందుకు జూలూరుపాడు సర్కిల్ పరిధిలో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిఘా మరింత కట్టుదిట్టం చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లోని వాహనదారులు పశువులు , ఇసుక, గంజాయి అక్రమ రవాణాలకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. సమావేశంలో సీఐ శ్రీలక్ష్మీ, ఎస్ఐ శివరామకృష్ణ, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

# మేడేపల్లి బ్రిడ్జిపై ప్రమాదకరంగా 11 కెవి విద్యుత్ వైర్లు



**-భయభ్రాంతులకు గురవుతున్న వాహనదారులు**
**-ప్రమాదాలు జరిగేంతవరకు పట్టించుకోరా...?**



**ప్రజాపక్షం/ఏన్కూరు:** మండల పరిధిలోని మేడేపల్లి బ్రిడ్జిపై 11 కెవి విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారి వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గత రెండు నెలల క్రితం మేడేపల్లి గ్రామ సమీపంలో వాగుపై వంతెన నిర్మించారు. వంతెనపై పది అడుగుల మేర విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. ఒక 11 కెవి విద్యుత్ వైర్లను కర్రలతో పైకి లేపారు. దీంతో అటుగా లోడుతో వెళ్లే వాహనదారులు ప్రమాదం ఎప్పుడు జరుగుతుందో అని భయపడుతున్నారు. ఈ మధ్యకాలంలో పలు ప్రమాదాల నుంచి వాహనదారులు బయటపడ్డారని గ్రామ ప్రజలు తెలుపుతున్నారు. ఏన్కూరు నుంచి రేపల్లెవాడ మీదుగా బ్రిడ్జిపై మేడేపల్లి, కాలనీ నాచారం, నాచారం, గంగుల నాచారం, ఒంటి గుడిసె మీదుగా జూలూరుపాడుకు నిత్యం వాహనాలు నడుస్తూ ఉంటాయి. ప్రమాదాలు జరిగేంత వరకు విద్యుత్ అధికారులు పట్టించుకోరా అంటూ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నతాధికారులు పెద్ద స్తంభాలు అమర్చి విద్యుత్ వైర్లను ఎత్తు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# 41 మందిపై బైండోవర్ కేసు నమోదు

**అక్రమ ఇసుక, గోవులను తరలిస్తే చర్యలు : ఎస్ఐ**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలంలో అక్రమ ఇసుక రవాణా, అక్రమ గోవుల తరలింపుపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. మండల వ్యాప్తంగా చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు చేపడుతున్నట్లు బూర్గంపాడు ఎస్ఐ మేడా ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన ప్రజాపక్షంతో మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణాతో ప్రభుత్వానికి భారీగా ఆదాయ నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. అలాగే అక్రమంగా గోవులను తరలించడం చట్టవిరుద్ధమని, ఇటువంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. మండల వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణా, అక్రమ పశువుల తరలింపుకు పాల్పడుతున్న 41 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ముఖ్యంగా మండల కేంద్రంలోని రెండు అక్రమ ఇసుక ర్యాంపుల ద్వారా ఇసుక తరలిస్తున్న 8 మందిపై ప్రత్యేకంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకున్నామని తెలిపారు. మరి కొంత మందిపై కూడా విచారణ కొనసాగుతోందని, సోమవారం మరిన్ని బైండోవర్ కేసులు నమోదు చేసే అవకాశం ఉందన్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేసే వారిపై క్రిమినల్ కేసులతో పాటు బైండోవర్ చర్యలు తప్పని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా సహజ వనరులను దోచుకునే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా కారణంగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా పర్యావరణానికి కూడా నష్టం జరుగుతోందన్నారు. అదే విధంగా అక్రమ గోవుల రవాణాపై కూడా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. అనుమతులు లేకుండా పశువులను తరలించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రి వేళల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా చట్టవిరుద్ధ కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా అక్రమ ఇసుక రవాణా లేదా గోవుల తరలింపు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో మండలంలో అక్రమ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# డిగ్రీ కళాశాల అధ్యాపకులకు ఆన్‌లైన్‌లో అవగాహన

**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో విద్యా వారోత్సవాలలో భాగంగా కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి కోటగిరి రాంబాబు, కంప్యూటర్ అప్లికేషన్స్ లెక్చరర్ దీపికలు జిల్లాలోని మొత్తం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు ఆన్‌లైన్ కంప్యూటర్ అప్లికేషన్స్,డిజిటల్ టెక్నాలజీ వినియోగం, ఆధునిక సాఫ్ట్‌వేర్ పై, అనంతరం మింటీ మీటర్ మరియు గామా వంటి ఆధునిక డిజిటల్ టూల్స్ వినియోగంపై ప్రాక్టికల్ డెమో ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పోలారపు పద్మ మాట్లాడుతూ ఈ టూల్స్ ద్వారా సృజనాత్మకత, ప్రజెంటేషన్ నైపుణ్యాలు మరియు డిజిటల్ కమ్యూనికేషన్ సామర్థ్యాలను మెరుగు పరచుకోవటంలో ఎంతగానో దోహదపడాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జె. మాధవి, టి. అరుణ కుమారి, కొండలరావు, వేముల కామేశ్వర రావు, శెట్టి స్వరూపరాణి, పొట్లపువ్వు శ్రీనివాస్, పొరెల్లి శ్రీనివాసరావు, శ్రీదేవి, విజయ్, వెంకటకృష్ణ, ప్రసాద్, శివ, భూక్యా శ్రీను, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి డిమాండ్ చేశారు. ఇంధన ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలపై భారం పడుతోందన్నారు. ఈకార్యక్రమంలో తురుములగూడెం సర్పంచ్ కుంజా జాన్, సీతారామపురం సర్పంచ్ సప్పా పిచ్చయ్య, బట్టీలగుంపు సర్పంచ్ సరిత, అమెర్ద ఉప సర్పంచ్ అంజిబాబు, నాయకులు కాక రాములు, కందుల లక్ష్మణ్, బారాజు సంపత్, మాదినేని రాంబాబు, వెంకటేశ్వర్లు, వేముల విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# అశ్వాపురంలో దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండల కేంద్రంలోని నడిరోడ్డుపై తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య యాదవ్ విగ్రహాన్ని యాదవ సంఘం నాయకులు రాత్రికి రాత్రే ప్రతిష్టించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిజాం పాలనలో రైతులపై జరిగిన అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. రైతాంగ హక్కుల కోసం ఆయన చేసిన త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. 1946 జూలై 4న కడవెండి గ్రామంలో జరిగిన రైతాంగ పోరాటంలో అమరుడైన దొడ్డి కొమురయ్య త్యాగం తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది పలికిందని పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య చూపిన ధైర్యం, త్యాగం నేటి యువతకు ఆదర్శమని, ఆయన ఆశయాల సాధన ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. యువత సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఉపాధ్యాయురాలిపై తేనెటీగల దాడి

**-భయంతో పరుగెత్తి కిందపడిన టీచర్ -తృటిలో తప్పిన ప్రమాదం**



**ప్రజాపక్షం/చండ్రుగొండ:** చండ్రుగొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న చెట్టుపై భారీగా తేనెటీగలు చేరి ప్రమాదకర పరిస్థితి నెలకొంది. సప్లమెంటరీ విద్యార్థులకు క్లాస్ చెప్పేందుకు వచ్చిన సైన్స్ టీచర్ అనితా బేబీపై తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. భయంతో పరుగులు తీసిన ఆమె కిందపడిపోవడంతో స్థానికులు వెంటనే సమీపంలోని ఆర్ఎంపీ వద్దకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఘటన సమయంలో విద్యార్థులు ఇంకా పాఠశాలకు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వందలాది మంది విద్యార్థులు చదివే పాఠశాలలో ప్రమాదకరంగా ఉన్న తేనె పట్టును వెంటనే తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.

# డిజిటల్ సభ్యత్వ నమోదు సమన్వయ కమిటీ నియామకం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమ రీజినల్ ఇంచార్జ్ ఎంఎల్‌సి తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, జిల్లా పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు, అశ్వారావుపేట ఇంచార్జ్, మాజీ ఎంఎల్ఏ మెచ్చా నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ములకలపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు సమన్వయ కమిటీని శనివారం నియమించారు. ఈసందర్భంగా పార్టీ బలోపేతానికి డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్‌సి సెల్ అధ్యక్ష పదవి రేసులో గద్దల రమేష్




**ప్రజాపక్షం/పాల్వంచ :** కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్ష పదవికి టిపిసిసి ఎస్‌సి సెల్ రాష్ట్ర కన్వీనర్ గద్దల రమేష్ ధరఖాస్తు చేసుకొన్నారు. ఈ మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా అబ్జర్వర్ వెంకటనర్సయ్య ధరఖాస్తులను శనివారం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని పని చేశానని చెప్పారు. సుమారు రాష్ట్ర నాయకులు ఎడవల్లి క్రిష్ణ నేతృత్వంలో మండలంలో సుమారు 15 వేయిల సభ్యత్వాలను చేర్పించినట్లు తెలిపారు. పార్టీ కష్ట కాలంలో ఉన్న పది సంవత్సరాల కాలంలో గ్రామ గ్రామాన తిరిగి కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేశానని అన్నారు. కావునా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్న నాకు జిల్లా ఎస్‌సిసెల్ అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షులు చీకటి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గురుకుల ఇంటర్ కౌన్సిలింగ్‌లో 480 సీట్లు భర్తీ

**ప్రజాపక్షం/భద్రాచలం :** స్థానిక గిరిజన గురుకుల కళాశాల ఆవరణలో ఐటిడిఏ పరిధిలోని ఇంటర్ గురుకులాల బాలురకు జరిగిన కౌన్సిలింగ్‌లో మొత్తం 539 సీట్లకు గానూ 480 సీట్లు భర్తీ అయినట్లు ఆర్‌సిఓ అరుణకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం ఆరు కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సం. విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించి సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ కౌన్సిలింగ్ ప్రక్రియలో ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

# పాఠ్యపుస్తకాలు సిద్ధం



- పక్కదారిపట్టకుండా బార్‌కోడ్
- మొత్తం కావాల్సిన పుస్తకాలు 505294
- ఇప్పటి వరకు చేరుకున్న పుస్తకాలు 449157
- సర్కారు చదువుల బలోపేతానికి కృషి
- జూన్ 12 నుండి బడులు పునఃప్రారంభం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పేద విద్యార్థుల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విద్యాసం. ప్రారంభిస్తుండగానే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే పాఠ్యపుస్తకాలు జిల్లా విద్యాశాఖ గోదాముకు 89 శాతం వరకు చేరుకున్నాయి. విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు అక్షరాస్యతా శాతాన్ని మరింతగా పెంచేందుకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలతో పాటు ఏకరూ పదుస్తులు, మధ్యాహ్నభోజనం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 202627 విద్యా సం.కు గానూ జూన్ 12 నుండి బడులు తెరిచిన వెంటనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు విద్యా యంత్రాగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే జిల్లాకు 449157 పుస్తకాలు చేరుకున్నాయి.

**505294 పుస్తకాలు అవసరం...**

జిల్లా వ్యాప్తంగా 23 మండలాల పరిధిలో అన్ని రకాల తరగతులకు చెందిన సుమారు 70 వేల మంది విద్యార్థినీ విద్యార్థులు చదువుతున్నారు. వీరికి మొత్తంగా 505294 పుస్తకాలు అవసరం ఉంటాయని గుర్తించిన అధికారులు నివేదికలు ప్రభుత్వానికి పంపడంతో ఇప్పటికే 449157 పుస్తకాలు జిలాల్లా కేంద్రానికి చేరుకున్నాయి. వీటిని మండల కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంకా 56137 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉంది. పుస్తకాలతో పాటు విద్యార్థులకు నోట్ పుస్తకాలను కూడా జూన్ 12వ తేదిన బడులు తెరవంగానే అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**దారిమళ్లకుండా ...**

ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం ఖచ్చితమైన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పాఠ్యపుస్తకాలపై సీరియల్ నెంబర్లు ముద్రించడంతో పాటు బార్‌కోడ్ వేస్తున్నారు. తద్వారా జిలాల్లో ఎన్ని పుస్తకాలు ఏఏ పుస్తకాలు చేరుకున్నాయో ఇట్టే తెలిసిపోతుంది. అంతే కాకుండా విద్యార్థులకు పంపిణీ చేసే సమయంలో కూడా అధికారులు పాఠ్యపుస్తకాలపై ఉన్న నెంబర్లను విద్యార్థుల పేర్ల వారీగా నమోదు చేయనున్నారు. అంతే కాకుండా పుస్తకాల దుర్వినియోగాన్ని నివారించేందుకు ప్రభుత్వం విజిలెన్స్ కమిటీలను కూడా ఏర్పాటు చేయనుంది.

# సిపిఐ బలోపేతానికి కృషి చేయాలి

**-సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**




**ప్రజాపక్షం/అశ్వాపురం:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. శనివారం అశ్వాపురంలోని సిపిఐ కార్యాలయంలో మండల, పట్టణ కార్యవర్గ సమావేశం ఈనపల్లి పవన్ సాయి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తూ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు. ఒకప్పుడు ఎంఎల్‌ఏలు, ఎంపీలు, జెడ్‌పిటిసిలు, ఎంపీపీలు గెలిపించిన చరిత్ర సిపిఐకే ఉందన్నారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్‌పిటిసి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. రైతులు పండించిన వడ్లను ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేయాలని, సహకార ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సారెడ్డి పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, మున్నా లక్ష్మీ కుమారి, అనంతనేని సురేష్, వేల్పుల మల్లికార్జున్, రాయపూడి రాజేష్, మేలపురం సురేందర్‌రెడ్డి, ముత్తబోయిన వెంకటేశ్వర్లు, పగిడిపల్లి జంపయ్య, దంతాల జగదీష్, కమటం వీరన్న, ఎడెల్లి కమలాకర్, బండ్ల తిరుపతయ్య, కంచర్ల రవి, కల్లూరు నరసింహారావు, ఇరుగు శ్రీకాంత్, చిలుకాని శ్రీనివాస్, మర్రి నాగరాజు, దండి నాగేష్, మిత్తుల జీఆర్, సబ్కా అజయ్, బడేటి ప్రవీణ్, ముత్తబోయిన వినోద్, తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుడా.. మన్నించయ్యా..!



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మహనీయుడిని దేశమంతా ఘనంగా స్మరించుకుంటోంది. అంబేద్కర్ ప్రతి భారతీయునికి గర్వకారణం. దానికి తగ్గట్లుగా ప్రజలు ఆయనను అర్థం చేసుకున్నారా.? రిజర్వే షన్ల ప్రదాతగానే ఎందుకు గుర్తిస్తున్నారు..? దళిత ఐకాన్ మాత్రమే ఎందుకు పరగణిస్తున్నారు..? అణగారిన వర్గాలకు ఇచ్చిన స్ఫూర్తి అందడం లేదా...? దేశానికి అంబేద్కర్ చూపించిన మార్గంలో నడుస్తున్న వారెంత మంది.? దేశ విదేశాల హితం కోసం అంబేద్కర్ చేసిన ప్రయత్నాలు. ఇప్పుడు రాజకీయ పార్టీల కబంధ హస్తాల్లో చిక్కి పోయాయి. దళితులను ఇంకా ఇంకా వేరుచేస్తూనే పోతున్నాయి. మారుతున్న కాలంతో పాటే మారుతున్న భావ జాలం కూడా ఈ పరి స్థితిని మరింత విషమం చేస్తోంది కానీ మెరుగు పరచడం లేదు. రోజు రోజుకీ అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటులో అభిమానమో.? లేక రాజకీ యమో.? జూలూరుపాడు మండల కేంద్రంలోని చంద్రుగొండ చౌరాస్తాలో ఏర్పాటు చేసిన రెండు విగ్రహాల మధ్య నేల మీద దీనంగా కనిపిస్తున్న మహనీయుడి మరో విగ్రహన్ని చుసిన వారు మహనీయుడా మన్నించండయ్యా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రాత్రికి రాత్రే వెలసిన రెండు అంబేద్కర్ విగ్రహాలు...**

గత నాలుగు సంవత్సరాల క్రితం కొంత మంది దళిత యువకులు, అధికారులకు, నాయకులకు, ప్రజా ప్రజాప్రతినిధులకు దరఖాస్తులు రూపంలో పత్రికా ప్రకటనల ద్వారా వేడుకొని 2022, ఫిబ్రవరి 13, బుధవారం అర్ధ రాత్రి అంబేద్కర్ యువసేన నాయకులు, బిఎస్పీ దళిత నాకులు, కాంగ్రెస్ దళిత నాయకులు. లంతా కలసి, చంద్రుగొండ క్రాస్ రోడ్డు వద్ద డివైడర్ పై, అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు జరిపారు. ఇట్టి విషయం తెలుసుకున్న, మరో దళిత వర్గం, ఎంఆర్పిఎస్, తెరాస పార్టీ దళిత వర్గ నాయకులంతా కలిసి, నడిరోడ్డుపై, మరో అంబేద్కర్ విగ్రహ ఏర్పాట్లు చేశారు. ఈ తతంగమంతా భద్రాద్రి కొత్తగూడెంజిల్లా జూలూరుపాడు మండల కేద్రంలో చంద్రుగొండ క్రాస్‌రోడ్డు నందు, రాత్రికి రాత్రే రెండు విగ్రహాలు ఒకే చోట ఏర్పాటు చేయడంతో వర్గ పోరులో రెండు విగ్రహాలు అవసరమా అని ఆనాడు గుగుసలాడారు.

-విగ్రహ ఏర్పాటులోవున్న శ్రద్ధ భద్రపరచడంలో లేకపాయే..?

-అవమానకరంగా దర్శనమిస్తున్న అంబేద్కర్ విగ్రహం





**నూతన విగ్రహ ఏర్పాటులో వున్న శ్రద్ధ, భద్రపరచడంలో లేదు...?**

గత 2022, ఫిబ్రవరి 13, బుధవారం అర్ధరాత్రి నడి రోడ్డుపై ఏర్పాటు చేసిన విగ్రహం లారీ ప్రమాదంలో స్వల్పంగా దెబ్బతినగా, లారీ యాజమాన్యం నూతన విగ్రహ ఏర్పాటుకు నష్ట పరిహారం చెల్లించగా ఓ దళిత నాయకుడు పాత విగ్రహాన్ని పక్కన పెట్టి. మరో నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేసి అంబేద్కర్ జయంతి సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్ చేతులు మీదుగా నూతన విగ్రహ ఆవిష్కరణ మండల కేంద్రంలో జరిపించగా, మరో దళిత వర్గం అంబేద్కర్ మహనీయుని జయంతి సందర్భంగా దళిత నాయకులు ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు జరుకోవడాన్ని చూసిన కొంతమంది ప్రజలు, ఇంత అభిమానం చూపిస్తున్న దళిత నాయకులు. నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో చూపించిన శ్రద్ధ, లారీ ప్రమాదంలో దెబ్బ తిన్న పాత విగ్రహాన్ని భద్రపరచకుండా ప్రధాన రహదారి, ప్రధాన సెంటర్ రోడ్డు పక్కనే పడేసి చేతులు దులుపు కుంటే నూతన విగ్రహం ఏర్పాటు లో వున్న శ్రద్ధ పాత విగ్రహం భద్రపరచడంలో ఎందుకు లేదు అనే విమర్శలు వినబడుతూ, మహనీయుడా మన్నించండి అని, విగ్రహాన్ని ప్రజలు వేడుకుంటున్నారు.

# నాకు ప్రచారం అవసరం లేదు

**-పైలాన్ నిర్మాణాన్ని తొలగించండి : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాజకీయంగా తనకు ఎటువంటి ప్రచారం అవసరం లేదని ఖమ్మంలో నిర్మిస్తున్న పైలాన్ నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్ బండ్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానానికి సంబంధించి ఇటీవల కొంత మంది నాయకులు పైలాన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పైలాన్ నిర్మాణం పివి నర్సింహారావు విగ్రహం వద్ద ఏర్పాటు చేస్తుండడంతో వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్‌కు పైలాన్ నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని ఆదేశించారు. పైలాన్ నిర్మాణ విషయం తనకు తెలియదని కొంత మంది కార్యకర్తలు అత్యుత్సాహంతో ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. మాజీ ప్రధాని పివి నర్సింహారావు వంటి మహోన్నత వ్యక్తిని కించపరిచేవిధంగా ఎలాంటి చర్యలు ఉండ కూడదని మంత్రి స్పష్టం చేశారు. కార్యకర్తలు ప్రచార ఆర్భాటాల కంటే ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పై దృష్టి సారించాలని సూచించారు.

# ప్రతిపాదనలు సమర్పించాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** జన్ భాగీదారీ సబ్సేదూర్, సబ్సే హెపలే కార్యక్రమంలో భాగంగా గిరిజన గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు ఈ నెల 18 నుండి 25 వరకు బ్లాక్ లెవల్ మాస్టర్ ట్రైనింగ్ ప్రోగ్రాముల నర్వహణకు ప్రజల ప్రతిస్పందన వివరాలు సంబంధిత ప్రతిపానలు రూపొందించి సమర్పించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ సంబంధిత ఎంపిడిఓలను ఆదేశించారు. శనివారం ఐటిడిఏ సమావేశ మందిరం నుండి టెలీకాన్ఫిరెన్స్ ద్వారా ప్రధాన మంత్రి జన్దాతి ఆదివాసీ న్యాయమహా అభియాన్, దర్తీ ఆబాజెన్ జాతీ గ్రామ ఉత్కర్ష అబియాన్ పరిధిలోకి వచ్చే అన్ని గ్రామాలలోజన్ భాగీదారీ సబ్సేదూర్, సబ్సే హెపలే కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించేలా సంబంధిత ఎంపిడిఓలు ప్రత్యేక చొరవచూపాలన్నారు. ఈ మేరకు ప్రణాళికలు రూపొందించి అందించాలని ఆదేశించారు.

# ఈ ఫార్మసీ విధానాన్ని రద్దు చేయాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** రోగులకు అవసరమైన మందులను విక్రయించే విధానంలో ఈ ఫార్మసీ విధానాన్ని రద్దు చేయాలని కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు సోమశేఖర్ డిమాండ్ చేశారు. ఈ నెల 20న దేశవ్యాప్త బంద్‌ను పురస్కరించుకుని శనివారం పట్టణంలోని జీయర్ మఠంలో బంద్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఫార్మా రంగాన్ని ప్రభావితం చేస్తున్న పలు సమస్యలపై ఇప్పటికే విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ ఫార్మసీవిక్రయాల ద్వారా ప్రజారోగ్యానికి ముప్పు అందని ఆవేదన వ్యక్తం చేశారు. అధునిక సాంకేతికతను అడ్డు పెట్టుకుని నకిలీ ప్రిస్క్రిప్షన్ల ద్వారా ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు పొంచి ఉందన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలంటూ కోరినా స్పందన లేకపోవడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కార్యదర్శి చల్లగుళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ మెడికల్ షాపుల యజమానుల సమస్యలపై ఈనెల 20న జరిగే దేశవ్యాప్తం బంద్‌లో భాగంగా భద్రాచలంలో కూడా జరిగే బంద్‌ను జయప్రథం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ షాపుల యజమానులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.